ఆమె వైపు గులాబీ చూపు

- మహిళా జపం.. గంప గుత్త ఓట్లే లక్ష్యం
- పోల్ మేనేజ్‌మెంట్‌పై భారాస దృష్టి
- మేనిఫెస్టోలో మహిళలకు వరాల జల్లు
- గృహిణీల కోసం రూ. 400కే గ్యాస్ సిలిండర్
- రూ. 3000 భృతి ప్రకటన.. ఇంటింటికి వెళ్లేలా ప్లాన్
- పురుషులతో సమానంగా మహిళా ఓటర్లు
- ఓటు బ్యాంక్ చెదరకుండా బీఆర్ఎస్ ఎత్తులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ :
తెలంగాణలో హ్యాట్రిక్ నమోదు చేయాలన్న గట్టి పట్టుదలతో ఉన్న భారాస వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దక్షిణాదిన చరిత్ర సృష్టించాలన్న కసితో గులాబీ పార్టీ పోల్ మేనేజ్‌మెంట్ పై దృష్టి సారించింది. రాష్ట్రంలో పురుష ఓటర్లతో సమానంగా ఉన్న మహిళా ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. మహిళా ఓటర్లు ఎటు వైపు ఉంటే ఆ పార్టీదే గెలుపు సులువుగా మారుతుందని బావిస్తున్న గులాబీ దళం.. దాన్ని క్యాచ్ చేసుకునే పనిలో పడింది. మహిళా ఓటర్లకు ఇప్పటికే పెద్ద ఎత్తున తాయిలాలను కురిపించింది. మేనిఫెస్టోలో అగ్రతాంబూలాన్ని కట్టబెట్టింది. ఒంటరి మహిళలను ఆదుకునేందుకు ఆసరా, అర్హులైన మహిళలకు నెలకు మూడు వేల భృతి, రూ. 400కే గ్యాస్ సిలిండర్, ఇండ్ల స్థలాలను సైతం మహిళలకే ఇచ్చేందుకు భారాస ప్లాన్ చేసింది. ఇప్పటికే గృహలక్ష్మిని అందిస్తుంది. మహిళా సంఘాలకు భవనాలు లాంటివి కట్టిస్తామని వెల్లడించారు. ఇవే కాకుండా ఇప్పటికే పలు పథకాలను భారాస సర్కార్ అమలు చేస్తోంది. వాటిని అలానే కొనసాగిస్తామని అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. ఇప్పుడు వీటన్నింటితో గులాబీ దళం మహిళల చెంతకు వెళ్లేందుకు సిద్ధం అవుతోంది. ఇన్నాళ్లు దసరా పండుగ అయిన తర్వాత మొదలు పెట్టాలని బావించారు. నేటి నుంచి మహిళా ఓటర్లను యాక్టీవ్ చేయడంతో పాటు వారి ఓటు బ్యాంకు చెదరకుండా, ప్రతిపక్ష పార్టీల వైపు మళ్లకుండా కాపాడుకునేందుకు భారాస క్షేత్రస్థాయి నుంచే మహిళా మంత్రాన్ని మొదలు పెడుతోంది.

ప్రచారంలో మహిళలు..
ప్రతి నియోజకవర్గంలో పార్టీలోని మహిళా నేతలతో స్టీలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఇకపై ఇంటింటికి వెళ్లే ప్రచారంలో మహిళలను ముందుంచాలని గులాబీ నేతలు బావిస్తున్నారు. మహిళా నేతల సేవలను ప్రచారంలో ఉపయోగించుకోబోతున్నారు. గడప గడపకు మహిళలను ఒక సారి నేరుగా పలకరించే ప్రయత్నం చేయనున్నారు. భారాస ఈ ఎన్నికల్లో వినూత్న ప్రచార సరళికి తెరలేపింది. ఇప్పటికే సోషల్ మీడియాను పెద్ద ఎత్తున యాక్టీవ్ చేశారు. మళ్లీd ఇప్పుడు మహిళా ఓటర్ల కోసం మహిళా సంఘాలను తమ వైపుకు తిప్పుకోనున్నారు. మహిళా సంఘాల్లో దాదాపు 70 శాతం మంది మహిళలు ఉన్నారు. వాటిని గులాబీ పార్టీ ప్రచారానికి ఉపయోగించుకోవడంతో ఓట్లు పడేలా ప్లాన్ చేస్తున్నారు. వారందరికి ఇప్పటికే పార్టీ నేతలు టచ్‌లోకి వెళ్లారు. ప్రతి గ్రామం, మండల అధ్యక్షులతో మంతనాలు జరపనున్నారు. వారి ద్వారా ఆయా గ్రామాల్లో ఉండే మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు గులాబీ దళం సిద్ధమవుతోంది.

ప్రతి ఇంటికి కేసీఆర్ పథకాలు..
ప్రచారంలో ఇప్పటికే కేసీఆర్ అందిస్తున్న పథకాలను, పొందిన లబ్ధిని మరోసారి గుర్తు చేయబోతున్నారు. స్థానిక ఎమ్మెల్యేలను చూడకుండా అధినేత కేసీఆర్‌ను చూసి ఓటు వేయాలని కోరుతున్నారు. ఇప్పటికే వివిధ కార్యక్రమాలతో ఒక విడుత సుడిగాలి పర్యటనలు పూర్తి అయ్యాయి. ఇప్పుడు ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించేలా నేటి నుంచి రంగంలోకి దిగుతున్నారు. ఒక వైపు అభ్యర్థి ప్రచారం చేస్తుండగానే మరో వైపు లోకల్ లీడర్లతో ఎన్నికల ప్రచారం సాగేలా ప్లాన్ చేస్తున్నారు. నిత్యం జనంలో చర్చ జరిగేలా.. ప్రతి ఓటర్‌కు టచ్‌లోకి వెళ్లేందుకు అభ్యర్థులు ఆసక్తి చూపిస్తున్నారు. ఓటర్ దేవుళ్లు ప్రచారాన్ని ఎలా చూస్తున్నారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతోంది.

బరిలో లెఫ్ట్

- మసకబారుతున్న కమ్యూనిస్టులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉనికి కోల్పోతున్న వైనం

ఉమ్మడి వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో:
ఓరుగల్లు అంటేనే పోరాటాల ఖిల్లా. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచి తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికింది కమ్యూనిస్టులే. నిజాం సర్కారుకు, భూస్వామ్య వ్యతిరేక పోరాటానికి బీజం వేసింది కూడా కమ్యూనిస్టులే. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో రక్తతర్పణం చేశారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎన్నికల రణరంగంలో కూడా కమ్యూనిస్టులు ముందు వరుసలో నిలబడ్డారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టిన తొలినాళ్లలో కమ్యూనిస్టులు ఒంటరిగానే బరిలో నిలిచారు. ఎన్‌టీఆర్ ప్రభంజనంలో కూడా నకిరేకల్ నుంచి నర్రా రాఘవరెడ్డి గెలుపొందగా నర్సంపేట నుంచి మద్దికాయల ఓంకార్ విజయం సాధించారు. ఆ తరువాత తెలుగుదేశం పార్టీతో పొత్తులో భాగంగా వరుసగా నర్సంపేట నుంచి ఐదుసార్లు ఓంకారు గెలిస్తే అందులో ఒకసారి ఎంసీపీఐ తరుపున గెలిచారు. మానుకోట నుంచి సీపీఐ తరుపున బండి పుల్లయ్య గెలుపొందారు. పరకాల నుంచి పోతరాజు సారయ్య గెలిస్తే జనగామ నుంచి ఏసిరెడ్డి నర్సింహారెడ్డి, సీహెచ్ రాజారెడ్డి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. సీహెచ్ రాజారెడ్డి తరువాత ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కమ్యూనిస్టులు ఏ ఒక్క అసెంబ్లి స్థానంలో గెలుపొందలేదు కాదా.. కనీసం డిపాజిట్లు సైతం దక్కించుకోలేదు. రాను రాను కమ్యూనిస్టులు మసకబారిపోయారు. కేవలం మేము ఉన్నామనే ఉనికి కోసం ఎన్నికలలో నిలబడడం ఆనవాయితీ వస్తోంది.

నర్సంపేట నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఓంకారు

నర్సంపేట అంటేనే ఓంకారు.. ఓంకారు అంటేనే నర్సంపేట అనే విధంగా ఉండేది. అసెంబ్లిdలో కూడా ఓంకారు అడిగే ప్రశ్నలకు అధికార పక్షం సమాధానాలు కూడా చెప్పలేని స్థితిలో దాటవేసిన రోజులు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. నర్సంపేటలో ఎప్పుడు హత్యలు, ప్రతి హత్యలతో రక్తపుటేరులు పారేది. విచిత్రమైన విషయం ఏమిటంటే ఓంకారు ఓ హత్య కేసులో జైలులో ఉండగా, అక్కడి నుంచే నామినేషన్ వేసి విజయం సాధించారంటే ఆరోజుల్లో కమ్యూనిస్టులంటే ప్రజలలో ఎంత పేరు ఉండేదో మనకు అర్థమవుతోంది. నాలుగుసార్లు సీపీఎం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఓంకారు, చివరిసారి సీపీఎం పార్టీ నుంచి బహిష్కరించిన తరువాత ఎంసీపీఐ పార్టీని పెట్టి ఆపార్టీ తరుపున పోటీ చేసి విజయం సాధించారు. అదే నర్సంపేట నుంచి కమ్యూనిస్టులకు చివరి అవకాశం దక్కింది. ఆ తరువాత టీడీపీ నుంచి రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

మానుకోట, పరకాల నుంచి సీపీఐ గెలుపు

తెలుగుదేశంతో ఎన్నికల పొత్తులో భాగంగా మానుకోట నుంచి బండి పుల్లయ్య, పరకాల నుంచి పోతరాజు సారయ్య సీపీఐ నుంచి ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. ఆ తరువాత సీపీఐ నుంచి పోటీ చేసినప్పటికి గెలిచిన దాఖలాలు లేవు. కనీసం డిపాజిట్లు కూడా రాలేదు. తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన తరువాత 2004లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా కలిసి పోటీ చేసినప్పటికి గెలువలేదు. ఒంటరిగా పోటీ చేసినప్పటికి సీపీఐకి ప్రాబల్యం ఉన్న వరంగల్ తూర్పు, పరకాల, మహబూబాబాద్ నియోజకవర్గాలలో డిపాజిట్లు రాలేదు.

జనగామ నుంచి రెండు సార్లు గెలిచిన సిపిఎం
జనగామ నుంచి తెలుగుదేశం పార్టీతో పొత్తులో భాగంగా సీపీఎం అభ్యర్థిగా ఏసిరెడ్డి నర్సంహారెడ్డి మూడు సార్లు పోటీ చేసినప్పటికి ఒకసారే ప్రజలు ఆదరించారు. ఆతరువాత సీపీఎం నుంచే సీహెచ్ రాజారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం టీడీపీతో పొత్తులున్నప్పటికి విజయం సాధించలేదు. 1994 సీపీఎం, సీపీఐలకు ప్రాతినిధ్యం కరువైంది. ఒంటరిగా పోటీ చేసినప్పటికి ఎక్కడ కూడా డిపాజిట్లు రాలేదు.

గుడిసెలు, భూపోరాటాలు ఉనికి కోసమే పనిచేశాయి...

వేలాది ఎకరాల భూములను పేదలకు దక్కేవిధంగా సీపీఐ, సీపీఎం పార్టీలు భూ పోరాటాలు చేసి సఫలీకృతమయ్యాయి. వరంగల్, హన్మకొండ, కాజీపేట, నర్సంపేట, జనగామ, మహబూబాబాద్ లాంటి పట్టణాలలో కూడా గుడిసెల పోరాటాలు చేశారు. భూముల కోసం, గుడిసెల కోసం ఉద్యమాలకు వస్తున్నారు. సభలు, సమావేశాలు నిర్వహిస్తే ఇప్పటికీ వేల సంఖ్యలో వస్తున్నారు కాని ఓట్లకు వచ్చే సరికి బూర్జువా పార్టీలకే ఓటు వేస్తున్నారు. అయితే ప్రతి నియోజకవర్గంలో కమ్యూనిస్టుల ప్రాబల్యం ఉంది.

రాను రాను కమ్యూనిస్టులపై ప్రజలలో సరియైన అభిప్రాయం లేకపోవడంతో ఓటు బ్యాంకు మరింత తగ్గిపోవడంతో ఒంటరిగా పోటి చేయకుండా బూర్జువా పార్టీలతో కలసి పోటీ చేసినప్పటికి ఫలితం లేకుండా పోతోంది. ఆయా నియోజకవర్గాలలో వామపక్షాల ఓట్లను ఉపయోగించుకొని బూర్జువా పార్టీలు విజయం సాధిస్తున్నారు. కాని వామపక్షాలు పోటీ చేసిన నియోజకవర్గాలలో మాత్రం డిపాజిట్లు కూడా తక్కడం లేదంటే బూర్జువా పార్టీలు తమ ఓటు కమ్యూనిస్టులకు వేయడంలేదని తేటతెల్లమవుతున్నప్పటికి కమ్యూనిస్టుల ఆలోచనా విధానంలో మార్పు రావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టీబీజేపీ కకావికలం!

- పూర్తిగా చేతులెత్తేస్తున్న కిషన్ రెడ్డి

కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డిని ఎందుకు టీ బీజేపీ అధ్యక్షుడిగా నియమించారో కానీ.. ఆయన ఇష్టం లేని పదవిని అంతే అనాసక్తంగా నిర్వహిస్తున్నారు. ఫలితంగా బీజేపీ పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిగా మారుతోంది. అసలే బలమైన అభ్యర్థులు లేర నుంటే.. మొదటి జాబితా తర్వాత ఉన్న నేతలు కూడా పార్టీ నుంచి వెళ్లిపోయే పరిస్థితిని కల్పించారు. రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ లోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. పాల్వాయి స్రవంతితో పాటు చల్లమల్ల కృష్ణారెడ్డి అనే నేతతో రాజీ చేసుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ధర్మపురి నుంచి టిక్కెట్ ఆశించిన మాజీ ఎంపీ వివేక్‌కు బీజేపీ అక్కడ కాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెన్నూర్ స్థానాన్ని కేటాయించింది. దీంతో ఆయన పార్టీపై ఆగ్రహంతో ఉన్నారు. భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ కూడా బీజేపీని వీడే అవకాశాలు ఉన్నాయి. మునుగోడు లేదా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నుంచి తనకు టిక్కెట్ కేటాయించాలంటూ ఆయన కోరారు. ఆ మేరకు దరఖాస్తు కూడా చేసుకున్నారు. కానీ ఆయనకు టిక్కెట్ ఎక్కడిస్తారో చెప్పడంలేదు. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానానికి పోటీ పడుతున్న మాజీ మంత్రి డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి ఇద్దరూ పార్టీకి తలనొప్పిగా మారారు. గద్వాలలో సీనియర్ న్యాయవాది అయిన వెంకట్రామ్ రెడ్డిని నిలబెట్టితనకు ఎంపీగా అవకాశమివ్వాలని అరుణ కోరుతున్నారు. ఇదే సమయంలో తన కుమారుడు మిథున్‌రెడ్డికి షాద్‌నగర్ అసెంబ్లీని కేటాయించి, తనకు లోక్‌సభకు అవకాశం కల్పించాలంటూ జితేందర్‌రెడ్డి కోరుతున్నారు. కానీ ఆయన్ను శాసన సభకు పోటీ చేయాలని హైకమాండ్ కోరుతోంది. కానీ తాను చేయనని ఆయన తెగేసి చెప్పారు. ముఖేష్ గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్ కూడాకాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు రెడీ అవుతున్నారు. టిక్కెట్లు ప్రకటించినప్పుడు ఇలాంటి అసంతృప్తులు సహజంగానే ఉంటాయి. కానీ వీరిని ఎవరినీ బుజ్జగించేందుకు ప్రయత్నాలు చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది.

టికెట్ల కేటాయింపులో కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య దోస్తీ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీలు నేటికీ టికెట్ల కేటాయింపులో ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. నిజామాబాద్ జిల్లాలో ఐదు శాసనసభ స్థానాలు ఉండగా ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ ముగురికి మాత్రమే పార్టీ టికెట్లు కేటాయించారు. బీజేపీ పార్టీ సైతం ముగ్గురు అభ్యర్థులకు టికెట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు. నిజామాబాద్ జిల్లా ఎంపీ అరవింద్ బీజేపీ పార్టీలో శాసించే స్థాయికి ఎదిగారు. జిల్లాలో తన అనుచరులకే టికెట్లు ఇప్పించే ప్రయత్నంలో మునిగితేలారు. నిజామాబాద్ జిల్లాలోని భారతీయ జనతా పార్టీ ఆర్మూర్ అభ్యర్థిగా పైడి రాకేష్ రెడ్డి, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ, నిజామాబాద్ కార్బన్ స్థానానికి ధన్పాల్ సూర్యనారాయణ గుప్తాకు బీజేపీ టికెట్లు కేటాయించింది. నిజామాబాద్ రూరల్, బోధన్ స్థానాల కేటాయింపులో కాంగ్రెస్, బీజేపీ నాయకులు స్నేహంతో మెలుగుతున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ధర్మపురి సంజయ్ టికెట్లు ఆశిస్తూ పెద్ద ఎత్తున లాబీయింగ్ చేస్తున్నారు. నిజామాబాద్ అర్బన్ నుండి ధర్మపురితో పాటు మహేష్ కుమార్ గౌడ్ పోటీలో నిలిచారు. అర్బన్ స్థానాన్ని ఎటూ తేల్చుకోలేక కాంగ్రెస్ అధిష్టానం పెండింగ్ లో పెట్టింది. వీరిద్దరి మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో, కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు పెద్దలు ధర్మపురికి చెక్ పెట్టేందుకు మరో ఎత్తుగడ వేశారు. గత ఎన్నికల్లో ఆర్మూర్ నుండి కాంగ్రెస్ పార్టీ నుండి పోటీచేసి ఓటమిపాలైన ఆకుల లలితను కాంగ్రెస్ పార్టీలో చేర్చి అర్బన్ స్థానాన్ని ఇప్పించే ప్రయత్నం చేశారు.

నిజామాబాద్ జిల్లాకు రాహుల్ గాంధీ వచ్చిన సందర్భంలో పార్టీలో ఆకుల లలితను చేర్చి టికెట్ ఖరారు చేయాలనే ప్రయత్నాలు చేశారు. ఆకుల లలిత గత ఎన్నికల్లో ఆర్మూర్ లో పోటీ చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి మోసం చేసిందని జిల్లాకు చెందిన పలువురు అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లారు. పార్టీలోకి తీసుకోవద్దని నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు అధిష్టానానికి మొరపెట్టుకోవడమే కాకుండా హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి అన్నీ తానై నడుపుతున్న మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి సైతం విముఖత వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు అధిష్టానానికి తలనొప్పిగా మారింది.

డి.శ్రీనివాస్ 30ఏళ్ల పాటు తన ఆధిపతయ్యం..

నిజామాబాద్ జిల్లా కేంద్రం నుండి గతంలో డి.శ్రీనివాస్ 30ఏళ్ల పాటు తన ఆధిపత్యాన్ని కొనసాగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు లోనూ డి.శ్రీనివాస్ కీల కపాత్ర వహించారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం డి.శ్రీనివాస్ ఇంటికి నేరుగా ముఖ్యమంత్రి కేసీఆర్ వెళ్లడంతో డీఎస్ ఆనాడు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. గులాబీ బాస్ డీఎస్ కు రాజ్యసభ సభ్యత్వాన్ని కట్టబెట్టారు. అనంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ పార్టీ తరపున డీఎస్ తనయుడు ధర్మపురి అరవింద్ పోటీ చేసి నిజామాబాద్ లో కాషాయం జెండా ఎగురవేశారు. అరవింద్ ఎంపీగా గెలుపొందడంతో గులాబీ దళం ధర్మపురి కుటుంబంపై గుర్రు పెట్టారు. కొన్నేళ్లపాటు డీఎస్ బీఆర్ఎస్ లోనే ఉంటూ సైలెంట్ గా తన రాజకీయ జీవితాన్ని గడిపారు.

బీజేపీ, కాంగ్రెస్ లో స్నేహం బలపడేనా..

నిజామాబాద్ అర్బన్ స్థానాన్ని ఎంపీ అరవింద్ సోదరుడు సంజయ్ ఆశిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ప్రస్తుతం సుదర్శన చక్రం తిప్పుతున్నారు. జిల్లాలోని ఐదు స్థానాలకు గాను తనతో పాటు మరో ఇద్దరు తన అనుచరులకే మాజీ మంత్రి టికెట్లను ఇచ్చే విషయంలో చక్రం తిప్పారు. మరో రెండు స్థానాలకు నేటి వరకు అభ్యర్థుల ప్రకటన విషయంలోనే పోటాపోటీగా అభ్యర్థులు ఎవరి వంతు ప్రయత్నాలు వారు చేస్తున్నారు. నిజామాబాద్ అర్బన్ స్థానాన్ని ఆశించి తిరిగి పాత గూటికి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆకుల లలిత పావులు కదిపారు. ఐదేళ్ల నుండి పార్టీ కోసం కష్టపడిన వారిని వదిలేసి గతంలో పార్టీకి మోసం చేసిన వారికి టికెట్ ఎలా ఇస్తారని నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఒక్కసారిగా తమ నిరసన గళాన్ని అధిష్టానానికి వినిపించింది. కాంగ్రెస్ అధిష్టానం ఆకుల లలితను పార్టీలోకి చేర్చుకోవడంతో పాటు టికెట్ కూడా ఇస్తామని హామీ ఇచ్చినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. చివరికి పార్టీలో చేరే విషయంలోనే ఆకుల లలితకు చుక్కలు చూపించారు.

నిజామాబాద్ అర్బన్ స్థానాన్ని ఎంపీ సోదరుడు ధర్మపురి సంజయ్ కి ఇప్పించాలని ఆంతరంగికంగా సుదర్శన్ రెడ్డితో స్నేహం చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఎంపీ సోదరుడికి నిజామాబాద్ అర్బన్ స్థానం టికెట్ ఇప్పిస్తే బోధన్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి గెలుపునకు సహకరిస్తానని ఎంపీ రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నట్లు తెలిసింది. తన సోదరుడికి అర్బన్ లో టికెట్ ఇప్పిస్తే బోధన్ బీజేపీ టికెట్ బలహీనమైన వ్యక్తికి ఇప్పించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు సహకరిస్తానని ఎంపీ అరవింద్ మాటిచ్చినట్లు రాజకీయ విశ్లేషకులు బాహాటంగా చర్చించుకుంటున్నారు. గత వారం రోజుల క్రితం బీజేపీ పార్టీ బూత్ స్థాయి సమావేశంలో ఎంపీ అరవింద్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలను ఉత్తేజపరిచారు. ఈ సమావేశంలోనూ సుదర్శన్ రెడ్డి మంచివాడని కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలు దేశద్రోహులంటూ ఎంపీ అరవింద్ వ్యాఖ్యలు చేయడంపై ఆనాడే పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో భారతీయ జనతా పార్టీలో ధర్మపురి కుటుంబం, కాంగ్రెస్ పార్టీలో పొద్దుటూరు కుటుంబం పై చేయిగా రాజకీయ పావులు కదుపుతున్నారు. బీజేపీ, కాంగ్రెస్ లు ఇలా స్నేహభావంతో మెలిగి అర్బన్ స్థానాన్ని, బోధన్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ పదిల పరుచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ నిజామాబాద్ స్థానాలను ఆశించారు. అర్బన్ స్థానాన్ని ధన్ పాల్ కు ఇప్పటికే ఖరారు చేశారు. రూరల్ స్థానాన్ని ఎండలకు కేటాయించాలని అధిష్టానం ఆలోచన చేస్తుంది. ఎంపీ మాత్రం నిజామాబాద్ జిల్లాలో ఎండలకు ఎమ్మెల్యే సీటు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ఎండలను ఎమ్మెల్యేగా పోటీ చేపించాలని అధిష్టానానికి బలంగా ఉంటే బాన్సువాడ నుండి బరిలోకి దింపాలని అధిష్టానానికి సూచించినట్లు తెలిసింది. రెండు రోజులుగా ఎండల ఎంపీ సైతం రాజీ కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఎంపీ అరవింద్ ఎమ్మెల్యేగా బరిలోకి దిగడంతో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎండల లక్ష్మీనారాయణకు సహకరిస్తానని హామీ ఇచ్చినట్టు బీజేపీ ఆంతరంగికులు ప్రచారం చేస్తున్నారు. బోధన్ లో బీజేపీ పార్టీ నుండి పోటీ చేసేందుకు గత రెండేళ్ల నుండి పార్టీ కార్యక్రమాలు మేడపాటి ప్రకాశ్ రెడ్డి పెద్ద ఎత్తున చేపడుతున్నారు. పార్టీని బలోపేతం చేయడంతో పాటు తన వ్యక్తిగత ఇమేజ్ ని కూడా నియోజకవర్గంలో మేడపాటి పెంచుకున్నారు. బీజేపీ, కాంగ్రెస్ ల స్నేహ సంబంధాలతో మేడపాటికి చెక్ పెట్టి మరో వ్యక్తికి బీజేపీ టికెట్టు కేటాయించాలని ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. ఇటువంటి పరిణామాలు బోధన్ బీజేపీలో చోటు చేసుకుంటే పార్టీకి కూడా పలువురు దూరమయ్యే ప్రమాదం ఉంది. గత ఎన్నికల్లో బీజేపీ బోధన్ లో డిపాజిట్లను పోగొట్టుకుంది. ప్రస్తుతం మేడపాటి ప్రజల్లోకి దూసుకువెళుతూ ప్రజాదరణను చూరగొన్నారు. పెద్దల స్నేహం ప్రకాష్ రెడ్డికి శాపంగా మారితే బీజేపీ పార్టీ మనుగడ బోధన్ లో ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

నర్సాపూర్ సీటు సునీతా లక్ష్మారెడ్డికే..

- మదన్ రెడ్డికి మెదక్ ఎంపి టికెట్

నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సునీతా లక్ష్మారెడ్డిని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ప్రస్తుత నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డితో కలిసి ఆమెకు బీఫామ్ అందజేశారు. ఈ క్రమంలో ప్రస్తుతం నర్సాపూర్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న మదన్ రెడ్డికి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. పార్టీలో అంతరత సర్దుబాటు చేస్తూ అధినేత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో భేటీ అయిన బీఆర్ఎస్ పార్టీ కోర్ కమిటీ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఏకగ్రీవంగా బీఆర్ఎస్ పార్టీ కీలక సభ్యులు తీసుకున్న నిర్ణయం పట్ల సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు.